క్లుప్తంగా

అన్యాక్రాంత భూములపై విచారణ నిర్వహించాలి

జంగారెడ్డిగూడెం : అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిపై విచారణ నిర్వహించాలని కోరుతూ సాలి రాజశేఖర్, జొన్నకూటి వెంకటేశ్వరరావు సోమవారం స్థాని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తిరుమలాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 10/6లోని 5 ఎకరాల అసైన్డ్ భూమి (భూదాన భూమి) అన్యాక్రాంతమైందన్నారు. ఈ భూమికి సంబంధించి కొందరి వద్ద పట్టాలు ఉన్నాయని, అయితే అవి అసలైనవా, నకిలీవా అనేది విచారించి, ఈ భూమిని ప్రభుత్వపరం చేసుకుని పేదలకు పంచాలని కోరారు.

వెంకటరమణయ్యకు నివాళి

కొయ్యలగూడెం : గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతి కార్యక్రమం కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి రీడర్స్ ఫోరం సభ్యులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. జూనియర్ కళాశాల విద్యార్థులు, రీడర్స్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

బుట్టాయగూడెం : బొరగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలవరం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, టి.నర్సాపురం, వేలేరుపాడు మండలాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పుస్తకాలు, పలకలు, బొమ్మలు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి బొరగం అశ్విని తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బొరగం ఫౌండేషన్ అధినేత బొరగం దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు వీటిని పంపిణీ చేసినట్లు తెలిపారు.

హౌసింగ్ సిబ్బందికి అవగాహన

టి.నరసాపురం : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇంటి నిర్మాణ లబ్ధిదారులకు అవార్డు ఎంపిక సర్వేపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ హౌసింగ్ డీఈ బి.సువర్ణరాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం 8 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అవార్డు అందించే ప్రక్రియ చేపట్టిందన్నారు. ఆగస్టు 1 నుంచి మూడు నెలల పాటు అధికారులు లబ్ధిదారుల గృహాలను సందర్శించాల్సి ఉందన్నారు. హౌసింగ్ డీఈవో ఎండీ సుభాని, సీఎల్ టీసీ దేవి, ఏఈ జి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు అభివృద్ధి చేయాలి

టి.నరసాపురం : మండలంలోని రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త సయ్యద్ నాసర్ పాషా సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ జేవీ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు.

సదస్సును జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం : ఈ నెల 30న విజయవాడలో జరిగే రైతు కార్మిక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏఐకేఎమ్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేష్ కోరారు. సోమవారం స్థానిక రామనర్సయ్య భవనంలో కార్మిక, కర్షక రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దేశంలోని పంటలన్నింటికీ ఆహార, వాణిజ్య, ఉద్యాన, సామాజిక వన పంటలకు సమగ్ర పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు నివాళి

కొయ్యలగూడెం : సర్ ఆర్థర్ కాటన్ 124వ వర్ధంతి కార్యక్రమం కొయ్యలగూడెం పీడబ్ల్యూడీ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇరిగేషన్ శాఖ డీఈ రవీంద్రబాబు సర్పంచ్ ముప్పిడి విజయ కుమారితో కలసి కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నేత మారిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఫలితం

చింతలపూడి : బడి బయట ఉన్న పిల్లలను నూరు శాతం బడిలో చేర్పించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి శ్యామ్ సుందర్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల అసెంబ్లీకి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదివితే తప్పక విజయం వరిస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన చేయాలని సూచించారు. పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే తలారి పరామర్శ

ద్వారకాతిరుమల: ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న ద్వారకాతిరుమల వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావును, అలాగే కంటి శస్త్రచికిత్స చేయించుకున్న జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్‌ను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని అన్ని శాఖల అధికారుల పనితీరును పరిశీలించారు.

జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులు

- జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 259 అభివృద్ధి పనులు
- రూ. 9.61 కోట్లతో పనుల వేగవంతం

జంగారెడ్డిగూడెం : గడపగడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు పనులు చేపట్టాయి. వీటిలో కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభం కాగా, మరి కొన్ని పనులు ప్రారంభించాల్సి ఉంది. మరికొన్ని పనులు పూర్తిగా , కొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయి. జంగారెడ్డిగూడెం డివిజన్‌లో పంచాయతీ రాజ్‌కు సంబంధించి 185 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో 74 పనులకు జీజీఎంపీ నిధులతో పనులు చేపట్టారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రారంభించిన గడపగడపకు మన ప్రభుత్వం నిరంతరాయంగా కొనసాగుతుండగా, ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలను త్వరితగతిన అధికారులు పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సహాయం కావాల్సిన వాటికి సంబంధించి నివేదికలు, ప్రణాళికలు పంపి, ప్రభుత్వ అనుమతులు, నిధులు వచ్చిన తరువాత అధికారులు చేపడుతున్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల స్పందన తెలుసుకునేందుకు ఉద్దేశించిన గడపగడపకు మన ప్రభుత్వం అనుకున్న లక్ష్యం దిశగా సాగుతోంది. ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు గడపగడపకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి వారికి అందిన వినతులు, సమస్యల పట్ల అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు స్పందిస్తున్నారు. దీనికి అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కూడా స్పందిస్తూ అందుకు అవసరమైన నిధులు, సహాయాన్ని అందిస్తోంది.

గ్రామ, వార్డు సచివాలయానికి రూ.20లక్షలు

గ్రామ స్వరాజ్యం సాధన దిశగా పరిపాలన ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు బాగా చేరువ అయ్యింది. ఈ క్రమంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు, సచివాలయాలను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలకు రూ.20 లక్షలు కేటాయించింది. ఈ నిధులను ఆయా సచివాలయాల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించవచ్చు. ఈ క్రమంలో జీజీఎంపీ ద్వారా వచ్చిన సమస్యలను ఆయా సచివాలయాల పరిధిలోనే పరిష్కరించేందుకు వీలు కలుగుతోంది.



కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెంలో సీసీ రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన సీసీ డ్రెయిన్‌లు



జంగారెడ్డిగూడెంలో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

జంగారెడ్డిగూడెం పీఆర్ డివిజన్‌లో చేపట్టిన పనులు

మండలం	పనులు	విలువ రూ. లక్షల్లో
ద్వారకాతిరుమల	40	154.70
జంగారెడ్డిగూడెం	05	13.00
బుట్టాయగూడెం	32	114.50
జీలుగుమిల్లి	53	205.00
కొయ్యలగూడెం	54	152.76
టి.నరసాపురం	01	2.80
మొత్తం	185	642.76

ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా చేపట్టిన పనులు

మండలం	పనులు	విలువ రూ. లక్షల్లో
చింతలపూడి	05	25.80
జంగారెడ్డిగూడెం	12	47.00
ద్వారకాతిరుమల	46	195.40
లింగపాలెం	06	30.00
కామవరపుకోట	05	20.00
మొత్తం	74	318.20

వివిధ అభివృద్ధి పనులు

జంగారెడ్డిగూడెం డివిజన్‌లో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను పంచాయతీరాజ్‌కు రూ. 642.76 లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్‌కు రూ. 318.20 లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధులతో పీఆర్‌లో 185 పనులు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో 74 పనులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఆయా శాఖల పరిధిలో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్‌లు, కమ్యూనిటీ హాల్‌లు తదితర నిర్మాణాలు చేపడుతున్నారు. మొత్తం 259 పనులకు గాను రూ. 9.61 కోట్లు వెచ్చిస్తున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం



జీజీఎంపీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. డివిజన్ పరిధిలో 185 పనులు చేపట్టి పనులు వేగవంతం చేశాం. కొన్ని పనులు పూర్తి కాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.

– కె.శ్రీను, పీఆర్ ఈఈ, జంగారెడ్డిగూడెం

వివిధ దశల్లో పనులు



ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో జీజీఎంపీ నిధుల ద్వారా 74 పనులు చేపట్టాం. వీటికి గాను రూ. 318.20 లక్షలు వెచ్చిస్తున్నాం. ఇప్పటికే వీటిలో కామవరపుకోట మండలంలో 5 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

– యు.సురేష్‌బాబు, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, జంగారెడ్డిగూడెం

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

ద్వారకాతిరుమల : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. మండలంలోని పి.కన్నాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఆయన కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలతో పాటు, రేషన్, కౌలుకార్డులను అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ అర్హత ఉండి ఏవైనా సాంకేతిక సమస్యల కారణంగా సంక్షేమ పథకాలు పొందని వారిని గుర్తించి, వారికి పథకాలను అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమన్నారు. అలాగే సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఒక వేదికని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ దాసరి సుబ్బలక్ష్మి, సచివాలయాల మండల కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, బొండాడ వెంకన్నబాబు, దాస రాంబాబు, కుక్కల గట్టియ్య, తోలేటి వెంకట సుబ్బారావు, కొడుదుల ప్రసాద్, అల్లె వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నన్ను పద్మ, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, గుర్రాల లక్ష్మణ్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ తదితరులున్నారు.

కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు

పోలవరం రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని ఇటికలకోట గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సామాన్య వ్యక్తికి పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా అధికారులే ఇంటింటికి వచ్చి అవసరమైన సేవలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లను అందించారు. సచివాలయం వద్ద మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార సెంటర్‌ను పరిశీలించి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఐటీడీఏ పీవో జీవీవీ సత్యనారాయణ, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సున్నం గంగాజలం, సర్పంచ్ సున్నం చంద్రమ్మ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రంగాపురంలో సురక్ష

లింగపాలెం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు అన్నారు. సోమవారం రంగాపురంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్‌బాబు, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల అందజేత

కొయ్యలగూడెం : జగనన్న సురక్ష కార్యక్రమం కొయ్యలగూడెంలో సోమవారం ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరింపూడి సచివాలయం-1 పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ గంజిమాల రామారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, ఎంపీటీసీలు గంటా శ్రీను, చింతా శ్రీదేవి, టౌన్ కన్వీనర్ సంకుకొండ, ముప్పిడి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి..

చింతలపూడి : జగనన్న సురక్ష కార్యక్రమంలో సమస్యలు పరిష్కరించుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. ప్రగడవరం-1 సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అంతకు ముందు గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ దాబి.రాంబాబు నాయక్, సర్పంచ్ టి.భూపతి, ఉప సర్పంచ్ ఎస్.రమేష్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల : రైతుకు కంది విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు



పోలవరం రూరల్ : ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



లింగపాలెం : ధ్రువపత్రాలు అందుకున్న లబ్ధిదారులతో జెడ్పీటీసీ హరినాథ్‌రాజు, ప్రజాప్రతినిధులు



కొయ్యలగూడెం : ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



చింతలపూడి : ప్రగడవరంలో సర్టిఫికెట్లు అందచేస్తున్న ఏఎంసీ చైర్మన్, ఎంపీపీలు

నీట మునిగిన పొలాలు

పోలవరం రూరల్ : గోదావరి ఎగపోటు నీటితో పోలవరం గ్రామంలో ఆకుమడులు వేసిన పొలాలు పూర్తిగా నీటమునిగాయి. కడెమ్మ స్లూయిజ్ గేట్లు వరద నీటితో మునిగిపోవడంతో నీరు పొలాల వైపు ఎగపోటు తన్నింది. దీనికి తోడు గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండవాగుల నీరు కూడా తోడైంది. పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఆకుమడులు వరద నీటిలో మునిగిపోయి ఉండటం వల్ల కుళ్లిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్లు జలమయం

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పోలవరంలో పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పోలవరం పంచాయతీ పరిధిలోని నూతనగూడెంలో గల మండల పరిషత్ పాఠశాలకు వెళ్లే రోడ్డు మార్గంలో సోమవారం వర్షం నీరు నిలిచిపోయింది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఈ వర్షం నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాయికుంట పునరావాస కేంద్రంలో తాగునీరు

వేలేరుపాడు : గోదావరి వరద బాధితులు నివాసముంటున్న రాయికుంట పునరావాస కాలనీలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు. సోమవారం రాయికుంట పునరావాస కాలనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం వాసులు ఈ కాలనీలో నివాసముంటున్నారని, వీరికి తాగునీటికి లోటు లేకుండా యాభైవేల మంచినీటి ప్యాకెట్‌లు సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా రెండు హ్యాండ్‌బోర్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ట్యాంకర్ల ద్వారా కూడా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు రేషన్ పంపిణీ

కుక్కునూరు : గోదావరి వరద ముంపుతో పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న బాధిత కుటుంబాలకు సోమవారం ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. వరద ప్రభావం ఎక్కువైతే బాధితులు రేషన్‌కు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఒకేసారి పంపిణీ చేసినట్టు తహసీల్దార్ డీ ఎల్ ప్రమద్వర చెప్పారు.



పోలవరం రూరల్ : పోలవరం ప్రాంతంలో ముంపునకు గురైన పొలాలు



వేలురుపాడు : రాయికుంట పునవాసకాలనీలో నూతనంగా వేసిన హ్యాండ్‌బోర్

కొండవాగుల ప్రవాహాల వద్ద పోలీసుల భద్రత

బుట్టాయగూడెం : గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో గిరిజన ప్రాంతంలో కొండ వాగులు ప్రవహించే అవకాశం ఉన్నందున కల్వర్టులు, వాగులు పొంగే ప్రదేశాల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లోని కల్వర్టులు, కొండ వాగులు ప్రవహించే ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భద్రతా చర్యలు చేపట్టారు. బుట్టాయగూడెం మండలంలో పలు కల్వర్టులు, వాగులు ప్రవహించే ప్రదేశాలను ఎస్సై వెంకన్న పరిశీలించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ

కొయ్యలగూడెం : తుపాను ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వానలకు వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కన్నాపురం పడమటి, తూర్పు కాలువలు అదే విధంగా వై.జంక్షన్ సమీపంలోని బైనేరు వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రాజవరం వద్దకు వచ్చేసరికి పులి వాగు, బైనేరు ఏకంకావడంతో ఎర్రకాలువ ఉధృతి కొనసాగుతోంది. రెవెన్యూ విద్యుత్ శాఖ అధికారులు రైతులకు అదే విధంగా ప్రజలకు ముందుస్తు జాగ్రత్తల్లో భాగంగా హెచ్చరికలు జారీ చేశారు. కన్నాపురంలో కాలువల ఉధృతికి కొద్దిసేపు పోలవరం బుట్టాయిగూడెం రోడ్లలో ట్రాఫిక్ నిలిచిపోయింది. హుకుంపేట చెరువు, రాజు చెరువు, అంకాల చెరువులలో పూర్తి నీటి సామర్థ్యం చేరుకుంది. యర్రంపేట వద్ద శరత్ చంద్ర చెరువు నుంచి వరద నీరు కళింగ మీదగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. పరింపూడి పంచాయతీ పరిధిలోని వరద నీరు ఇళ్లల్లోకి చేరుకోవడంతో ఎస్టీ నగర్, రాజీవ్ నగర్ చేపల పేటలలో ప్రజలు ముంపు బారిన పడ్డారు.

ఇటికలకోటలో గడపగడపకు



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసిందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం ఇటికలకోట గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు వర్షంలో కూడా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్‌లు పథకాల గురించి మీకు తెలియజేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రతి ఇంట్లో లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం అందించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేకు పలు సమస్యలను విజ్ఞప్తి చేశారు. ఆయన అధికారులతో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీ సుంకర వెంకటరెడ్డి జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ సున్నం చంద్రమ్మ, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి



జీలుగుమిల్లిలో యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. నిరీక్షణ్ రావు కోరారు. ఆ సంఘ మండల స్థాయి సమావేశం పి.సాల్మన్ రాజు అధ్యక్షతన జీలుగుమిల్లిలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు జాతుల మధ్య వివాదం సృష్టించి క్రైస్తవులపై దాడులు చేయడం అమానుషం అని అన్నారు. ఇప్పటికైనా ఈ దాడులను కేంద్ర ప్రభుత్వం ఆపి మణిపూర్‌లో శాంతీయుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలని కోరారు. మణిపూర్‌లో దాడులు ఆపాలని కోరుతూ ఈ నెల 28న జీలుగుమిల్లిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఎస్‌వీ అప్పారావు, ఎస్.సాల్మన్‌రాజు, ఎస్ఐజీఎస్ కుమార్, సలహాదారు మద్రి జాన్‌మోషే, పి.పౌలు, వి.డేవిడ్, గుర్రాల ప్రభుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మానవత్వాన్ని మరిచి మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించి, వారి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) మండల అధ్యక్షులు కలింపూడి సుందరరావు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించిన ఏఐకేఎంఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ ఘటన యావత్ భారతావని తలదించుకునేలా చేసిందన్నారు. ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి : మణిపూర్ అల్లర్లపై నిరసన వ్యక్తం చేస్తూ సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నుంచి బోసుబొమ్మ సెంటర్‌వరకు ప్రదర్శన జరిపి రాస్తారోకో చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని, బీజేపీ సర్కార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వీఎస్‌నారాయణ, మండల కార్యదర్శి బాలరాజు, జిల్లా నాయకురాలు ఎం.లక్ష్మి పట్టణ మహిళా సంఘం నాయకురాలు అనురాధ, ఎస్‌డి జబ్రుల్లా, డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలోనూ పోలీసులకు వినతిపత్రం అందజేశారు. పలువురు పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.